సాక్షి
జోగులాంబ గద్వాల

గురువారం । 20 । జూన్ । 2024



'నులి'పేద్దాం

పిల్లలకు గురువారం నుంచి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు.

వివరాలు 8లో ▸



'గృహజ్యోతి' అమలయ్యేనా?

జీరో విద్యుత్ బిల్లు రాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.2/26.1

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి వేళల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ అభ్యర్థులు అర్హులని, దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5లక్షలకు మించరాదని పేర్కొన్నారు. వచ్చే నెల 3వ తేదీ వరకు www.tsbcstudycircle. cgg.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన అభ్యర్థులకు 9నెలల పాటు ఉచిత శిక్షణ, భోజన వసతి, స్టడీ మెటీరియల్స్‌తోపాటు నెలకు రూ.5వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.6,289

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు బుధవారం 148 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ. 6289, కనిష్టం రూ. 3249, సరాసరి రూ. 5589 ధరలు పలికాయి. అలాగే, 3 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్టం రూ.5460, కనిష్టం రూ.3010, సరాసరి రూ.3010 ధరలు వచ్చాయి. 21 క్వింటాళ్ల వరి (సోన) రాగా, గరిష్టం రూ. 2326, కనిష్టం రూ.2169, సరాసరి రూ.2326 ధరలు పలికాయి. క్వింటాల్ కంది రాగా గరిష్టం, కనిష్టం, సరాసరి ధర రూ.7116 వచ్చింది.

స్వల్పంగా తగ్గిన ఉల్లి ధర



దేవరకద్ర/ జడ్చర్ల: ఉల్లి ధర స్వల్పంగా తగ్గింది. గత నెలలో రూ. 2వేలు దాటని ఉల్లి ధర.. సీజన్ తగ్గిన తర్వాత అమాంతం పెరిగింది. గత వారం ఏకంగా రూ. 3 వేలు దాటిపోయింది. ఈ వారం కొంతమేర ధర తగ్గడంతో కొనుగోలు దారులు ఊరట చెందారు. బుధవారం దేవరకద్ర మార్కెట్‌కు దాదాపు 300 బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. క్వింటాల్‌కు గరిష్టంగా రూ. 2,900, కనిష్టంగా రూ. 2,200 ధరలు పలికాయి. 45 కేజీల ఉల్లి బస్తాను రూ. 1,100 నుంచి రూ. 1,500 వరకు విక్రయించారు.

ఆర్ఎన్ఆర్ రూ. 2,650

దేవరకద్ర మార్కెట్‌లో జరిగిన టెండర్లలో ఆర్ఎన్ఆర్ ధాన్యం క్వింటాల్ గరిష్టంగా రూ. 2,650, కనిష్టంగా రూ.2,629 ధరలు వచ్చా యి. ఆముదాలు రూ.5,650 ధర పలికింది.

మొక్కజొన్న రూ. 2,517

బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న గరిష్టంగా రూ. 2,517, కనిష్టంగా రూ. 2,086 ధరలు పలికాయి. ఆర్ఎన్ఆర్ ధాన్యం గరిష్టంగా రూ. 2,329, కనిష్టంగా రూ. 1,919, హంస గరిష్టంగా రూ. 1,858, కనిష్టంగా రూ. 1,819, జొన్నలు గరిష్టంగా రూ. 5,321, కనిష్టంగా రూ. 4,100, వేరుశనగ రూ. 4,309 ధరలు వచ్చాయి.

22న స్పీడ్ సైక్లింగ్ పోటీలు

మక్తల్: పట్టణంలో రాష్ట్ర సైక్లింగ్ పోటీలను ఈనెల 22 తేదీన మినీ స్టేడియంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి విశ్రాంత పీటీ గోపాలం తెలిపారు. బుధవారం మక్తల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 24, 25వ తేదీల్లో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ సైక్లింగ్ అకాడమీలో ప్రవేశం కోసం పోటీలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో ప్రతిభ కనబర్చిన వారిని ఈ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు. 12 నుంచి 15 సంవత్సరాలలోపు బాలురు పోటీల్లో పాల్గొనాలని, 5కిలోమీటర్లు ఉంటుందని, పాల్గొనే వారు బోనోఫైడ్, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని తెలిపారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, డీవైఎస్‌ఓ వెంకటేష్ పోటీలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

అయ్యో.. పాపం!

- ముళ్లపొదల్లో అప్పుడే పుట్టిన మృత ఆడ శిశువు లభ్యం
- నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రి మార్చురీకి మృతదేహం తరలింపు

- వివరాలు 8లో..



మహబూబ్‌నగర్‌లోని కొన పాలమూరు పాఠశాలకు 11 కంప్యూటర్లు అందించి ప్రత్యేకంగా ల్యాబ్ ఏర్పాటు చేశారు. అయితే కొన్నేళ్ల నుంచి వీటిని వినియోగించకపోవడంతో అవన్నీ వృథాగా మారి.. మరమ్మతుకు గురయ్యాయి. కంప్యూటర్లతో **పాటు ఒక ప్రింటర్, జనరేటర్ సైతం మూలకు** చేరడంతో రూ.లక్షల్లో ప్రజా**ధనం ఇలా దుమ్ముపట్టాయి.**



నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరులోని గిరిజన ఉన్నత పాఠశాలలో ఐటీసీ ఆధ్వర్యంలో 2009లో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఇందులో 8 కంప్యూటర్లను ఏర్పాటు చేయగా.. నాలుగేళ్ల పాటు ఇన్‌స్ట్రక్టర్లను నియమించి ల్యాబ్ నిర్వహించారు. ఆ తర్వాత నుంచి కంప్యూటర్ ల్యాబ్ నిర్వహణ కరువైంది. ఇక్కడి కంప్యూటర్లలోనూ ఒకటి పని చేయడం లేదు. కంప్యూటర్ **ల్యాబ్‌తో పాటు ప్రొజెక్టర్ సైతం నిరుపయోగంగా మారింది.**



వనపర్తి జిల్లాలోని చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలకు కంప్యూటర్లను అందుబాటులోకి తెచ్చారు. పాఠశాలలో 140 మంది విద్యార్థులకు గాను 9 మంది ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. అయితే విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇచ్చేవారు లేక అవి మూలకు చేరాయి. దీంతో కంప్యూటర్ రూంలకు తాళాలు పడటంతో విద్యార్థులకు సాంకేతిక విద్య అందని ద్రాక్షగా మారింది.

కంప్యూటర్ విద్య.. అంతా మిథ్య

సర్కార్ బడుల్లో అటకెక్కిన డిజిటల్ విద్య

- ఐటీసీ ప్రాజెక్టులో బడులకు **ట్యాబ్‌లు** ఇచ్చిన ప్రభుత్వం
- ఊసేలేని 'మీనా ప్రపంచం' రేడియో ప్రసారాలు
- వృథాగా మారిన రూ.లక్షల **విలువైన** ప్రింటర్లు, జనరేటర్లు
- పేద విద్యార్థులకు దూరం **అవుతున్న** సాంకేతిక పరిజ్ఞానం

కంప్యూటర్ విద్య మిథ్యగా మారింది. ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులకు కార్పొరేట్‌స్థాయిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యనందించాలన్న ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన కంప్యూటర్ విద్య మూన్నాళ్ల ముచ్చటగా మారింది. రూ.లక్షలు వెచ్చించి కంప్యూటర్లు కొన్నప్పటికి వాటిని ఎలా ఉపయోగించాలో చెప్పేవాళ్లు లేక మూలకు పడ్డాయి. – మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్

సాక్షి ఫోకస్

ప్రస్తుత ఆధునిక ప్రపంచమంతా డిజిటలైజేషన్ చుట్టూ తిరుగుతోంది. ఈ క్రమంలో చాలామంది తల్లిదండ్రులు డిజిటల్ విద్య కోసం ప్రైవేట్ పాఠశాలల వైపు చూస్తున్నారు. దీంతో ప్రభుత్వం సైతం డిజిటల్ విద్య కోసం చర్యలు చేపట్టింది. అందుకోసం ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల కోసం ఐటీసీ కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. దాదాపు అన్ని ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల కోసం డిజిటల్ తరగతులు బోధించేందుకు ప్రత్యేకంగా ప్రొజెక్టర్లు, స్క్రీన్లు, కేయాన్‌లను అందించింది. ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సైతం కథలు, నాటికలు, ప్రముఖుల రేడియో ప్రసంగాలను వినిపించేందుకు ప్రత్యేకంగా 'మీనా ప్రపంచం' పేరుతో రేడియోలను ప్రభుత్వం పంపిణీ చేసింది.

■ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా 860 పాఠశాలలు ఉండగా.. ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలల్లో ఒక్కో కంప్యూటర్ ల్యాబ్ కోసం ప్రభుత్వం రూ.లక్షల్లో ఖర్చు చేసి ఏర్పాటు చేసింది. ఇందులో ఒక్కో ల్యాబ్‌కు సుమారు 8 నుంచి 11 మానిటర్లు, సీపీయూలు, ప్రింటర్లు, విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రత్యేక జనరేటర్లను సైతం ప్రభుత్వం సమకూర్చింది. వీటికోసం ప్రత్యేకంగా ఒక గదిలో ఫర్నిచర్, కుర్చీలతో ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో కంప్యూటర్ విద్యను నేర్పే బాధ్యతను ఐదేళ్ల పాటు ఎన్ఐఐటీ సంస్థకు అప్పగించగా.. ఆ కాంట్రాక్టు 2013తో ముగిసింది. ఆ తర్వాత పాఠశాలలోనే కొందరు టీచర్లకు బాధ్యతలు అప్పగించారు. అయితే చాలా కంప్యూటర్లు మరమ్మతుకు గురవడం, సర్వీసింగ్ లేకపోవడంతో మూలకు పడ్డాయి. గతంలో వీటిపై విద్యార్థులకు ఎంఎస్ ఆఫీస్, ఫొటోషాప్, టైపింగ్ వంటివి నేర్పించేవారు. ప్రస్తుతం వినియోగంలో లేకపోవడంతో అవన్నీ వృథాగా మారాయి.



మహబూబ్‌నగర్‌లోని కొన పాలమూరు పాఠశాలలో నిరుపయోగంగా జనరేటర్



నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో 11 జిల్లా పరిషత్ పాఠశాలలకు 11 చొప్పన కంప్యూటర్లు అందజేశారు. 2008 నుంచి నాలుగేళ్లు శిక్షకులు ఉన్నా.. ఆ తర్వాత బోధించేవారు లేక వాటిని మూలకు పడేశారు. దీంతో అన్ని కంప్యూటర్లు తప్పపట్టి పాడైపోయాయి. మక్తల్‌లోని జిల్లాపరిషత్ పాఠశాలలో కంప్యూటర్లను ఇలా ఓ చెక్క బీరువాలో అమర్చారు.

ఉన్నతాధికారుల దృష్టికి..



మా పాఠశాలకు గతంలో 11 కంప్యూటర్లు అందించి ప్రత్యేకంగా ల్యాబ్ ఏర్పాటు చేశారు. కానీ, వీటిని కొన్నేళ్లుగా వినియోగించకపోవడంతో చాలా వరకు మరమ్మతుకు గురయ్యారు. వీటిని బాగు చేసేందుకు ఒక్కో కంప్యూటర్‌కు రూ.500 చొప్పున ఖర్చు అవుతుందని తెలిసింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు స్పందించి మరమ్మతు చేసి అందుబాటులోకి తెస్తే సాంకేతిక విద్య విద్యార్థుల దరిచేరుతుంది.

– దెబోరా, కొనపాలమూరు పాఠశాల హెచ్ఎం, మహబూబ్‌నగర్

వాడుకలోకి తెస్తాం..



జిల్లాలో వివిధ పాఠశాలల్లో ఉన్న కంప్యూటర్‌లను మళ్లీ వాడుకలో తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. త్వరలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్ని కంప్యూటర్‌లు పని చేస్తున్నాయో వివరాలు సేకరించి.. రిపేర్లు అవసరమయ్యే వాటికి మరమ్మతులు చేయిస్తాం.

– రవీందర్, డీఈఓ

పునరావాస కేంద్రాల్లో పనులు వేగవంతం చేయండి



నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్: నెట్టెంపాడు ప్రాజెక్ట్‌లో భాగంగా రిజర్వాయర్ల పరిధుల్లోని నిర్వాసిత గ్రామాలకు నిర్మించిన పునరావాస కేంద్రాల్లో పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితులపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పునరావాస కేంద్రాల్లో నిర్వాసితుల సౌకర్యార్థం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాల్స్ తదితర భవనాలను నిబంధనలకు అనుగుణంగా నిర్మించాలని సూచించారు. నెట్టెంపాడు ఎత్తిపోతల ప్రాజెక్ట్ కింద ఉన్న రిజర్వాయర్ల నీటి సామర్థ్యం, ఆయకట్టు, వివిధ ప్యాకేజీ పనుల పరిస్థితి, ఇంకా చేయాల్సిన భూసేకరణ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. గట్టు ఎత్తిపోతల పథకం కోసం ఇప్పటి దాకా సేకరించిన భూముల వివరాలు తెలుసుకున్నారు. ఆర్డీఎస్ ద్వారా జిల్లాలోని ఆయకట్టుకు అనుకున్నంత స్థాయిలో నీటిని వినియోగించకపోవడానికి కారణాలు, తుమిళ్ల రిజర్వాయర్ల ద్వార ఎంత నీటిని ఆయకట్టుకు అందించే అవకాశం ఉందని అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గుర్రంగడ్డ గ్రామం వద్ద కృష్ణా నదిపై నిర్మిస్తున్న వంతెన పనుల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన జిల్లాలోని ఆయా ప్రాజెక్టుల భౌగోళిక మ్యాప్‌లను పరిశీలించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ శ్రీనివాసరావు, ఈఈలు రహీముద్దీన్, వెంకటేశ్వర్‌రావ్, జుబేర్ అహ్మద్, విజయ్‌కుమార్‌రెడ్డి, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

నులిపురుగుల నివారణలో భాగంగా ప్రతి విద్యార్థికి అల్బెండజోల్ మాత్ర వేయించి, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మిద్దామని కలెక్టర్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన ఈ నెల 20న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం – అల్బెండజోల్ మాత్రల పంపిణీ ఏర్పాట్లపై వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాలు, వసతిగృహాలు, గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలందరికి మాత్రలు వేయించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రతిరోజు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. వర్షపునీరు గుంతల్లో నిలవకుండా చూడలన్నారు. మురుగునీటి కాల్వలు ప్రతిరోజు శభ్రం చేస్తూ, దోమలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. తాగునీరు కలుషితం కాకుండా, లీకేజీలను గుర్తించి, అరికట్టాలని సూచించారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేస్తూ, క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో కలిసి జాతీయ నులిపురుగుల నిర్మూలన గోడ పత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శశికళ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సిద్దప్ప, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ అక్టర్ నవీన్‌క్రాంతి, డీఆర్‌డీఓ నర్సింగరావ్, డీపీఓ వెంకట్‌రెడ్డి, ఇంటర్‌మీడియేట్ జిల్లా నోడల్ అధికారి హృదయరాజ్, బీసీ, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి శ్వేత ప్రియదర్శినితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి



వనపర్తి: కార్మికుల సంక్షేమానికి కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు బుద్దారం మురహరి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలో జరిగిన ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అసంఘటిత కార్మికులకు ప్రమాద బీమా, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రతి కార్మికుడికి లేబర్‌కార్డు అందించి ప్రభుత్వం కల్పించే అన్ని వసతులు అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసేంత వరకు కేంద్ర ప్రభుత్వంపై పోరాడతామని వివరించారు. అనంతరం మురహరిని సంఘం జిల్లా కార్యవర్గం సన్మానించింది. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు సాయిబాబా, జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మహిళా అధ్యక్షురాలు గిరిజ, నర్మద, అమరచింత మండల అధ్యక్షుడు దాస్, నరేష్, కవిత పాల్గొన్నారు.

మైనార్టీ యువతకు ఉచిత శిక్షణ

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాలోని మైనార్టీ నిరుద్యోగ యువతకు గ్రూప్–2, గ్రూప్–3 ఉద్యోగాల పోటీ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రవీంద్రనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్, సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 45 రోజుల పాటు (ఉమ్మడిగా, నాన్ రెసిడెన్షియల్) శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఐడీఓసీ భవనంలోని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయంలో ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నులిపురుగులు నివారిద్దాం



జిల్లా కేంద్రంలో ర్యాలీ చేపట్టిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

- జెండా ఊపి ర్యాలీ చేపట్టిన జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి శశికళ

గద్వాల క్రైం: నులిపురుగుల కారణంగా చిన్నారులు అనేక ఆరోగ్య సమస్యలతో సతమతమవుతూ ఉన్నారని, వాటి నివారణకు పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు అందించాలని జిల్లా ఇంచార్జ్ వైద్యాధికారిణి శశికళ అన్నారు. గురువారం ఈమాత్రల పంపిణీ చేపట్టనుండగా.. బుధవారం ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు వైద్యాశాఖ ఆధ్వర్యంలో జెండా ఊపి పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ముందుగా ఆమె జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. నులి పురుగులు వల్ల చిన్నారులు రక్తహీనతకు గురికావడంతోపాటు శారీరక, మానసిక ఎదుగుదలకు ఆటంకంగా మారుతాయని, ఆహారం సహించకపోవడం, ఆకలి ఉండక వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుందన్నారు.

జిల్లాలో 1.52లక్షల మంది పిల్లల గుర్తింపు

జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 1 –19 సంవత్సరాల లోపు ఉన్న 1,52,731 మందికి ప్రతి అంగన్‌వాడీ, పాఠశాల, కళాశాలలో మాత్రలు నేటి నుంచి అందించనున్నట్లు ఆమె వివరించారు. ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించవచ్చన్నారు. ఈ మాత్రను భోజనం చేసిన తర్వాతే వేసుకోవాలని, రెండేళ్లలోపు చిన్నారులకు సగం మాత్రను పొడి చేసి తాపాలని, రెండేళ్ల నుంచి ఆపై వారికి ఒక మాత్ర వేసి చప్పరించి మింగేలా చూడాలన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో వివిధ గ్రూప్‌లకు సంబంధించి సెమిస్టర్ 2, 4, 6 రెగ్యులర్, 1, 2, 3, 4, 5, 6 బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను బుధవారం పాలమూరు యూనివర్సిటీలో రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి విడుదల చేశారు. 2వ సెమిస్టర్‌లో రెగ్యులర్ విద్యార్థులు 919 మందికి గాను 355 మంది, 4వ సెమిస్టర్‌లో 935 మందికి గాను 489 మంది, 6వ సెమిస్టర్‌లో 919 మందికి గాను 812 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాజ్‌కుమార్, అడిషనల్ కంట్రోలర్ నాగభూషణం, శాంతిప్రియ, విజయలక్ష్మి, సత్యనారాయణగౌడ్, ఈశ్వరయ్య, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొన్న లారీ

● భార్య మృతి, భర్తకు గాయాలు


మమత (ఫైల్)

మక్తల్: ద్విచక్ర వాహనంపై భార్యాభర్తలిద్దరు వెళ్తుండగా లారీ ఢీకొట్టడంతో భార్య మృతి చెందగా, భర్తకు గాయాలయ్యాయి. ఈ ఘటన పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని అనుగొండకు చెందిన సంజీవ్ తన భార్య మమత కలిసి మక్తల్‌కు వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి గ్రామానికి వెళ్తుండగా, పట్టణంలో మహబూబ్‌నగర్ నుంచి వస్తున్న లారీ బైకును ఢీకొట్టింది. మమత లారీ టైరు కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. భర్త పక్కకు ఉండటంతో ప్రమాదంలో నుంచి బయటపడ్డాడు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉండటంతో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతురాలికి కూతురు ఉంది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


హనుమంతు(ఫైల్)

మిడ్జిల్: మండల పరిధిలోని లింబ్యాతండాకు చెందిన నేనావత్ హనుమంతు(30) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. లింబ్యాతండాకు చెందిన హన్మంత్ కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే నివసిస్తున్నాడు. ఆదివారం హైదరాబాద్ నుంచి గ్రామానికి వచ్చాడు. ఇటీవల అప్పుల బాధ, కుటుంబంలో కలతలు తరచూ చోటుచేసుకోవడంతో, జీవితంపై విరక్తి చెంది వ్యవసాయ పొలం వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలియజేశారు. రెండు రోజుల నుంచి వెతికినా ఆచూకీ లభించలేదు. ఎక్కడా లభ్యం కాకపోవడంతో తన వ్యవసాయ పొలానికి సమీపంలోని గుట్టలపై మంగళవారం రాత్రి 12 గంటలకు కుటుంబ సభ్యులు, తండా వాసులు వెతుకసాగారు. గుట్టలపై ఆచూకి లభ్యం కావడంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చి బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ ఆనంద్‌ను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. మృతుడికి భార్య పద్మతో పాటుగా ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తండావాసులు వివరించారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ సమీపంలోని నోవెల్ టెక్ దానా కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న వెంకట రామయ్య (40) బుధవారం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వెంకట రామయ్యతో పాటు మరో డ్రైవర్ సిద్ద రామయ్య కలిసి కంపెనీకి చెందిన బైక్‌పై మంగళవారం మధ్యాహ్నం భూత్పూర్‌కు భోజనం నిమిత్తం వచ్చి భోజనం చేశారు. తిరిగి కంపెనీకి వెళ్తుండగా అమిస్తాపూర్ సమీపంలోని సాక్షి దేవాలయం వద్ద బైక్ అదుపు తప్పి ఇద్దరు కింద పడిపోగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకట రామయ్య మృతి చెందాడు. మృతుడి బావమరిది నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు


పోతులమడుగు చెందిన మరోవ్యక్తి..

మండలంలోని గ్రామానికి చెందిన మహ్మద్ అబ్దుల్ ఖాదర్ (52) జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. పోతులమడుగు చెందిన మహ్మద్ అబ్దుల్ ఖాదర్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని నెలలుగా తరుచూ కడుపు నొప్పితో బాధ పడుతుండేవాడు. ఆస్పత్రిలో ఎన్నో సార్లు చూపించిన నయం కాలేదు. కడుపు నొప్పి బాధను భరించలేక ఈ నెల 17 సాయంత్రం పోతులమడుగు శివారులోని జాతీయ రహదారి పక్కన పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. అదే గ్రామానికి చెందిన కావలి వెంకట్రాములు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆయనను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు . మృతుడి భార్య సర్దార్ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పు చెల్లించని వ్యక్తికి 15 రోజుల రిమాండ్

లింగాల: మండల కేంద్రానికి చెందిన పరమేశ్వర్‌కు బుధవారం అచ్చంపేట కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పరమేశ్వర్ ఓ వ్యక్తి వద్ద అప్పుగా రూ.3.50 లక్షలు తీసుకున్నాడు. చెల్లించాల్సిన వాయిదాలను చెల్లించకపోవడంతో అప్పు ఇచ్చిన వ్యక్తి కోర్టులో సివిల్ కేసు నమోదు చేశాడు. కోర్టు సమన్లు ఇచ్చినా హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నాడని ఎస్‌ఐ తెలిపారు. దీంతో జడ్జి వారెంట్ జారీ చేయడంతో అప్పు తీసుకున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చారు. దీంతో న్యాయమూర్తి 15 రోజులు రిమాండ్ విధించగా.. కల్వకుర్తి జైలుకు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

నులిపేద్దాం..



పాటించాల్సిన జాగ్రత్తలు

- చేతి, కాలివేళ్ల గోళ్లను చిన్నవిగా కత్తిరించుకోవడంతో పాటు శుభ్రంగా ఉంచుకోవాలి.
- పరిశుభ్రమైన నీళ్లను తాగాలి. పరిసరాల శుభ్రత పాటించాలి.
- రోజు వారీగా ఇంట్లో తీసుకునే ఆహారంపై ఎప్పుడూ మూతలు ఉంచి పెట్టాలి.
- వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవడం ఎంతో అవసరం.
- పండ్లు, కాయగూరలను శుభ్రమైన నీళ్లతో కడిగి వినియోగించాలి.
- భోజనం చేసే ముందు, మలవిసర్జన తర్వాత చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి.

పిల్లల్లో నులి పురుగులతో రక్తహీనత.. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

- నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు
- 19 ఏళ్లలోపు వారందరూ వేసుకోవాలి
- నేటి నుంచి మాత్రల పంపిణీ

పాలమూరు: కడుపులో నులి పురుగులతో చిన్నారులు అనేక అనారోగ్య సమస్యలకు గురవుతుంటారు. వారి శారీరక, మానసిక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈనేపథ్యంలో నులి పురుగులను నివారించడమే లక్ష్యంగా వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నులిపురుగుల నివారణ వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా 1 నుంచి 19 ఏళ్లలోపు వారికి గురువారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు పక్కా ప్రణాళిక రూపొందించారు.

వైద్యసిబ్బందికి శిక్షణ

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీకి సంబంధించి ఇప్పటికే వైద్యారోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. సబ్ సెంటర్స్ ఏఎన్‌ఎం, ఆశావర్కర్లకు మాత్రలను అందజేశారు. ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ప్రాథమిక పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మాత్రలను పంపిణీ చేయనున్నారు. వైద్యారోగ్యశాఖ లెక్కల ప్రకారం జిల్లాలో 1నుంచి 19ఏళ్ల మధ్య వయసున్న పిల్లలు 2,45,789 మంది బాలబాలికలు ఉన్నారు. వీరిలో సుమారు లక్షమంది వరకు రక్తహీనత, పోషకాహార లోపం, ఇతర సమస్యలతో బాధపడుతున్నారు.

మాత్రల వల్ల ప్రయోజనాలు..

ఆల్బెండజోల్ మాత్రలతో నులి పురుగులను పూర్తిగా నాశనం చేయవచ్చు. తద్వారా రక్తహీనత సమస్య తీరుతుంది. వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుంది. విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతోంది. పోషకాహార లోపాన్ని నివారిస్తుంది. చిన్నారుల్లో పోషక విలువలు పెరుగుతాయి. పిల్లలు తీసుకునే పోషకాహార పదార్థాలు వారి శరీరానికి సరిగ్గా అందుతాయి. పరోక్షంగా పిల్లల్లో వ్యాధి నిరధోక శక్తి పెరుగుతుంది. ఏకాగ్రత, అభ్యసన సామర్థ్యం పెరుగుతుంది. ఈ ప్రయోజనాలు సాధించడానికిగాను ప్రపంచ ఆరోగ్య సంస్థ, భారత కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ జూన్ 20న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం నిర్వహించాలని నిర్ణయించింది. నులిపురుగుల నిర్మూలనకు ఒక్క అల్బెండజోల్ మాత్రను నోట్లో వేసుకొని చప్పరిస్తే చాలంటున్నారు వైద్యులు.

సమస్యలు..

నులి పురుగులతో బారినపడ్డ వ్యక్తి ప్రధానంగా ఎనిమియా (రక్తహీనత)కు గురవుతారు. ఎక్కువగా నీరసించిపోతారు. శారీరక, మానసిక ఎదుగుదల అంతంతమాత్రంగా ఉంటుంది. ఆకలి మందగించి జీర్ణ సంబంధ సమస్యలు తలెత్తుతాయి. చర్మంపై దురదలు వస్తుంటాయి. కొందరు పిల్లల్లో దీర్ఘకాలం పాటు ఇవి ఉన్నప్పటికీ.. వ్యాధి లక్షణాలు కనిపించకపోవచ్చు. కానీ సమస్య వారి ఆరోగ్యంపై ప్రభావితం చూపుతుంది. నులి పురుగులు ఎక్కువగా ఉంటే ఆపరేషన్ చేయాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో పిల్లలు, యువకులకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. దీనివల్ల వాటి సంక్రమణాన్ని నియంత్రించవచ్చు. శారీరక, మానసిక అభివృద్ధికి దోహదపడుతుంది. అయితే 1-2 ఏళ్ల పిల్లలకు సగం మాత్ర, 3-19ఏళ్ల వారికి ఒక మాత్ర వేయాలని వైద్యులు చెబుతున్నారు. వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మాత్రమే మాత్రలు వేయాలని సూచిస్తున్నారు. గురువారం మాత్రలు వేయించుకోకపోతే, ఈనెల 27న మాపింగ్ డే నిర్వహించి అందించనున్నారు.

నులి పురుగులు ఎలా తయారవుతాయి..

మానవుడిలోని పేగుల నుంచి పోషకాలను గ్రహించి అభివృద్ధి చెందుతాయి పరాన్నజీవులు. నులి పురుగులు ఉన్న పిల్లలు బహిరంగంగా మలవిసర్జన చేయడం వల్ల వాటి గుడ్లు నేలలో లార్వాలుగా వృద్ధి చెందుతాయి. నేల కలుషితమవుతుంది. మిగతా పిల్లలు మట్టిలో ఆడుకునే సమయంలో గోళ్లలోకి, చర్మంలోకి చేరుతాయి. చేతులను శుభ్రంగా కడుక్కోకుండా భోజనం చేసినట్లయితే, ఆహారం ద్వారా పొట్టలోపలికి చేరతాయి. లోపలికి చేరిన గుడ్లు, లార్వాలు నులి పురుగులుగా అభివృద్ధి చెందుతాయి. పేగులలోని పోషకాలను ఆహారం రూపంలో తీసుకొని, తిరిగి కడుపులో గుడ్లను ఉత్పత్తి చేస్తాయి. అవి మలంతో పాటు బయటకు విసర్జితమవుతాయి. బహిరంగంగా చేసే మలవిసర్జనతో ఇవి నిత్యం విస్తరిస్తాయి. ఇది.. నులిపురుగుల సంక్రమణ చక్రం. జిల్లాలో దాదాపు 70 శాతం కుటుంబాలకు వ్యక్తిగత మరుగుదొడ్లు లేకపోవడం వల్ల నులి పురుగుల వ్యాప్తి పెరుగుతోంది.

నిర్మూలన ఎలా..

ఏడాది నుంచి 19 ఏళ్ల వయసు వరకు ఉన్న పిల్లల్లో నులిపురుగుల సంక్రమణ ఉన్నదా? అని పరీక్షించి, గుర్తించడానికి చాలా శ్రమించాల్సి ఉంటుంది. 60 శాతం మంది ఇదే సమస్యతో ఉన్నందున సామూహికంగా నులిపురుగుల నిర్మూలన కోసం ప్రత్యేకంగా ఆల్బెండజోల్-400 మి.గ్రా. మాత్రను తయారు చేశారు. 1-2 ఏళ్ల వయసున్న పిల్లలకు 200 మి.గ్రా. మాత్ర, 6-19 ఏళ్ల మధ్య వయసు కల్గిన వాళ్లకు 400 మి.గ్రా. మాత్ర వేయాలి. ఒక్క మాత్ర పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పడుతుందని వైద్యారోగ్యశాఖ అధికారులు భరోసా ఇస్తున్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేశాం..

జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 20న ఆల్బెండజోల్ మాత్రలు వేసేందుకు ప్రణాళికలు, సిద్ధం చేశాం. ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లకు అవగాహన కల్పించాం. ఏడాది నుంచి 19 ఏళ్లలోపు వారంతా తప్పనిసరిగా మాత్రలు వేసుకోవాలి. జిల్లాకు 2.88 లక్షల మాత్రలు వచ్చాయి.

– డాక్టర్ శంకర్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

ఉమ్మడి జిల్లాలో 19 ఏళ్లలోపు వారి సంఖ్య ఇలా..

జిల్లా	బాలికలు	బాలురు	మొత్తం
మహబూబ్‌నగర్	1,20,917	1,24,872	2,45,789
నారాయణపేట	77,762	78,848	1,56,610
నాగర్‌కర్నూల్	1,0.3224	1,04,612	2,07,836
వనపర్తి	80,096	82,750	1,62,846
గద్వాల	72,303	78,184	1,50,487


నులిపురుగల మాత్రలు వేస్తున్న సిబ్బంది (ఫైల్)

అయ్యో.. పాపం!

- ముళ్లపొదల్లో అప్పుడే పుట్టిన మృత ఆడ శిశువు లభ్యం
- నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రి మార్చురీకి మృతదేహం తరలింపు


ముళ్ల పొదల్లో లభ్యమైన ఆడశిశువు మృతదేహం

నాగర్‌కర్నూల్ క్రైం: ముళ్ల పొదల్లో మృతశిశువు లభ్యమయిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని బుధవారం చోటుచేసుకుంది. శ్మశానవాటిక సమీపంలోని ముళ్లపొదల్లో ఓ బట్టలో చుట్టి ఉన్న పసికందు మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి వెంటనే చేరుకున్న పోలీసులు చుట్టుపక్కల పరిసరాలను సైతం పరిశీలించి శిశువు మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆడశిశువును ఇద్దరు వ్యక్తులు చెట్ల పొదల్లోకి తీసుకెళ్లడం కొందరు స్థానికులు చూసినట్లు తెలుస్తోంది. ఆడశిశువు ముళ్ల పొదల్లో వేయకముందే చనిపోయి ఉందా.. లేదంటే ఎవరైనా చంపి ముళ్ల పొదల్లో వేశారనే అనుమానం వ్యక్తమవుతుంది. ఈ ఘటనపై ఎస్‌ఐ రామేశ్వర్‌రెడ్డి వివరణ కోరగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, సీసీ కెమరాల ఆధారంగా ఆడశిశువును ముళ్ల పొదల్లో ఎవరు వేసారని గుర్తిస్తామని తెలిపారు.

గ్రాట్యుటీ చెల్లింపులో నిర్లక్ష్యం తగదు : ఇఫ్టూ


మాట్లాడుతున్న ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం

అమరచింత: బీడీ కార్మికులకు గ్రాట్యుటీ చెల్లింపులో ఫ్యాక్టరీ యాజమాన్యాలు నిర్లక్ష్యం వహించడం సరికాదని ఇఫ్టూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.సూర్యం అన్నారు. మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయమై గురువారం హైదరాబాద్‌లో ఫ్యాక్టరీ యాజమాన్యాలతో కార్మిక సంఘం నాయకులు చర్చిస్తారన్నారు. 1972 గ్రాట్యుటీ చట్టం ప్రకారం ప్రతి ఏడాది 15 రోజుల వేతనాన్ని లెక్కించి కార్మికుడి సర్వీసు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాల్సి ఉంటుందని.. బీడీ ఫ్యాక్టరీల యాజమాన్యం మాత్రం కేవలం రూ. వెయ్యి చెల్లించి చేతులు దులుపుకోవడం దారుణమన్నారు. 30 ఏళ్ల కిందట చందూల్ బీడీ ఫ్యాక్టరీ యజమాని ఇస్మాయిల్, గోపాల్‌రెడ్డి సమక్షంలో చనిపోయిన కార్మికుల వారసులకు రూ.1,500 చెల్లించాలని తీర్మానించారని.. ప్రస్తుతం పెరిగిన ధరలతో పోల్చుకుంటే కనీసం రూ.30 వేలు చెల్లించాల్సిన అవసరం ఉందని చెప్పారు. చట్టబద్ధంగా సర్వీసు లెక్కిస్తే రూ.లక్షలోపు కార్మికుడు లబ్ధి పొందాలన్నారు. యాజమాన్యాలు వివిధ కారణాలు చూపుతూ గ్రాట్యుటీ పెంపుదలను ఆమోదించడం లేదని.. యాజమాన్యాలతో జరిగే చర్చలు కొలిక్కి రాకపోతే చట్టబద్ధంగా కంట్రోలింగ్ అథారిటీకి కార్మికుడు దరఖాస్తు చేసుకోవడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. సమావేశంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సామేలు, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు దేవదానం, కోళ్ల వెంకటన్న, వెంకటేష్‌గౌడ్, సి.రాజు తదితరులు పాల్గొన్నారు.

దేశరక్షణలో అగ్నివీర్‌ది కీలకపాత్ర


మాట్లాడుతున్న కల్నల్ వి.సందీప్

వనపర్తి: దేశరక్షణతో పాటు యువత మంచి కెరీర్ సాధించుకోవడానికి అగ్నివీర్‌ను సద్వినియోగం చేసుకోవాలని వాయుసేన రిసోర్స్ పర్సన్ కల్నల్ వి.సందీప్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన అగ్నివీర్ అవగాహన సదస్సుకు ఆయన హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 17 నుంచి 21 ఏళ్లలోపు యువత అగ్నివీర్‌లో చేరి దేశరక్షణలో తమవంతు పాత్ర పోషించేందుకు ఇదొక చక్కటి అవకాశమన్నారు. అగ్నివీర్‌లో ఎయిర్‌ఫోర్స్, నేవీ, ఆర్మీ అనే మూడు విభాగాలు ఉంటాయని.. ఎంపికైన రోజు నుంచి నెలకు రూ.30 వేల వేతనం లభిస్తుందన్నారు. ఆరు నెలల శిక్షణ పూర్తయ్యాక 40 నెలలు సర్వీస్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. అగ్నివీర్ సాయుధ దళంలో విశిష్ట ర్యాంకు కలిగి ఉంటారని.. నాలుగేళ్ల వ్యవధి పూర్తయిన తర్వాత రూ.11.71 లక్షల సేవానిధి అందజేస్తారని వివరించారు. దేశ రక్షణలో యువత సైనికులుగా కొంతకాలం సేవలందించేందుకు, పటిష్టమైన దేశభద్రత కోసం అగ్నివీర్ ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాస్, డీవైఎస్‌ఓ సుధీర్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ధాంసింగ్, ఎన్‌సీసీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యోగాలో వనపర్తి విద్యార్థి ప్రతిభ


దండు సుగుణతో యోగా ప్రతినిధులు

వనపర్తి: పాటియాలలోని నేతాజీ సుభాష్ చంద్ర బోస్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి యోగా శిక్షణ కార్యక్రమంలో తెలంగాణ నుంచి వనపర్తికి చెందిన దండు సుగుణ పాల్గొని ప్రథమ గ్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించింది. యోగా అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్ సుగుణను అభినందించారు. యోగాలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, మంచి ఆరోగ్యం, ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. యోగా ప్రతి మనిషి జీవితంలో భాగం కావాలని కోరారు.

అన్నపూర్ణదేవి విగ్రహం లభ్యం



రాజోళి: జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండల కేంద్రంలో బుధవారం అన్నపూర్ణదేవి విగ్రహం లభ్యమైంది. సుంకేసుల బ్యారేజీ సమీపంలో కేబుల్ లైన్ ఏర్పాటు కోసం గుంతలు తీస్తుండగా.. అమ్మవారి విగ్రహం లభ్యమైనట్లు స్థానికులు తెలిపారు. స్థానిక అర్చకుడు ఆడివి స్వామి అక్కడికి చేరుకొని అమ్మవారి విగ్రహాన్ని భ్రమరాంబ అడివేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. విషయం తెలుసుకున్న మహిళలు ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. పురాతన ఆలయాలు ఉన్న రాజోళిలో అన్నపూర్ణదేవి విగ్రహం లభ్యం కావడం ప్రాముఖ్యతను సంతరించుకుంది. కాగా, లభ్యమైన అమ్మవారి విగ్రహం పురాతనమైనది కాదని.. నూతనంగా ప్రతిష్ఠించేందుకు తయారు చేయించిన విగ్రహంలా ఉందని స్థానికులు చెబుతున్నారు.

ఆటో అపహరణ

పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఓ స్కూల్ ఎదుట రోడ్డుపై నిలిపిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సద్దలగుండు చౌరస్తాలోని స్టాండ్లీ మోడల్ స్కూల్ వద్ద బుధవారం ఓ ఆటో డ్రైవర్ ఆటోను రోడ్డు పక్కనే నిలిపి పిల్లలను పాఠశాల లోపల దింపడానికి వెళ్లాడు. ఈ క్రమంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అక్కడికి వచ్చి ఆటోను తీసుకెళ్లారు. ఈ దృశ్యాలు అక్కడ ఓ దుకాణం వద్ద ఉన్న సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. అయితే ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని టూటౌన్ పోలీసులు వెల్లడించారు.

మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ


బాధిత మహిళ కొత్తకాపు శ్రీదేవి

కొత్తకోట రూరల్: టీ కొట్టు నడుపుతున్న మహిళ మెడలోంచి బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు లాక్కెళ్లిన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం సమీపంలో ఎన్‌హెచ్ 44పై చోటుచేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దమందడి మండలం మద్దిగట్లకి చెందిన కొత్తకాపు శ్రీదేవి తన భర్త జగదీశ్వర్‌రెడ్డితో కలిసి కొన్ని నెలలుగా పాలెం ఎన్‌హెచ్ 44 పక్కన సాయిదాబా సమీపంలో టీకొట్టు నడుపుతుంది. బుధవారం సాయంత్రం భర్త హోటల్ వద్ద లేకపోవడంతో శ్రీదేవి ఒక్కతే హోటల్ నిర్వహిస్తుంది. కొత్తకోట వైపు నుంచి బైక్‌పై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి టీ ఇవ్వాలని కోరారు. ఆమె టీ ఇచ్చిన తర్వాత సదరు వ్యక్తి టీ తాగుతూ ఆమెను మాటల్లో దించాడు. ఇదివరకు పరిచయం ఉన్న వ్యక్తిలా వ్యవహరించాడు. అనంతరం టీ డబ్బులు ఇచ్చి వెళ్లేందుకు సిద్ధం కాగా డబ్బులు తీసుకున్న శ్రీదేవి టీ డబ్బులు పోను మిగతా డబ్బులు తిరిగి ఇచ్చే క్రమంలో మెడలోని 3.5 తులాల బంగారు గొలుసును దుండగులు బలవంతంగా లాక్కెళ్లారు. ఆమె వెంటనే కేకలు వేయడంతో వారు బైక్‌పై పరారయ్యారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

చెంచు మహిళపై దాడి

● ఆలస్యంగా వెలుగులోకి..


బాధితురాలు ఈశ్వరమ్మ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతలపల్లి సమీపంలో ఉన్న భ్రమరాంబకాలనీలో చెంచు మహిళపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు ఈశ్వరమ్మ కథనం మేరకు.. వారం రోజుల కిందట చెంచు కాట్రాజు ఈశ్వరమ్మ భర్త ఈదన్నతో గొడవపడి మండలంలోని చుక్కాయపల్లికి వెళ్లింది. వీరిద్దరూ గ్రామానికి చెందిన బండి వెంకటస్వామి, ఆయన తమ్ముడు శివుడు వద్ద జీతం ఉన్నారు. విషయం తెలుసుకున్న వారు ఎందుకు వెళ్లావని మందలించడంతో పాటు ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని గ్రామానికి తీసుకొస్తు మార్గమధ్యంలో విచక్షణ రహితంగా కొట్టారు. అనంతరం గ్రామానికి తీసుకొచ్చి రాత్రి 9 గంటల సమయంలో ఒంటిపై ఉన్న దుస్తులు ఊడదీసి కారం రుద్ది కొట్టారని.. అడ్డొచ్చిన తన భర్తను సైతం బాదారని తెలిపింది. విషయం తెలుసుకున్న నేషనల్ ఆదివాసి లిటరిటీ కౌన్సిల్ సంస్థ (ఎన్‌ఏఎస్‌సీ) వారు బుధవారం ఇంటికి రాగా జరిగిన విషయం చెప్పడంతో వెంటనే ఏఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఏఎస్పీ ఆదేశాలతో ఎస్‌ఐ రుషికేష్, జిల్లా సఖి కేంద్రం నుంచి సరిత, అనిత గ్రామానికి వచ్చి విచారించారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం కొల్లాపూర్ ఆస్పత్రికి తరలించారు.

మహిళను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


ప్రమాదంలో పడిన సాయిమ్మ

చిన్నంబావి: రోడ్డు దాటుతున్న మహిళను ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్ర గాయాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెలగొండ గ్రామానికి చెందిన సాయమ్మ పెబ్బేరు నుంచి తన స్వగ్రామానికి ఆర్టీసీ బస్సులో చేరుకుంది. వెలగొండలో బస్సు దిగి, బస్సు ముందుభాగం నుంచి రోడ్డు దాటడానికి ప్రయత్నించింది. గమనించని ఆర్టీసీ డ్రైవర్ బస్సును ముందుకు పోనివ్వడంతో మహిళను ఢీకొట్టింది. మహిళ బస్సు ముందు టైర్ల కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరబాద్‌కు తీసుకెళ్లినట్లు స్థానికులు పేర్కొన్నారు.

మద్యం తాగించి కడియాలు చోరీ

బిజినేపల్లి: బస్సులో ప్రయాణం చేసే ఒక గుర్తు తెలియని మహిళ మరో మహిళతో పరిచయం చేసుకుని, మద్యం తాగించి ఆమె కాళ్లకు ఉన్న కడియాలను, మెడలో పుస్తెల తాడును చోరీ చేసిన ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అడ్డాకుల మండలం, కందూర్ గ్రామానికి చెందిన లక్ష్మీదేవమ్మ మండలంలోని నందివడ్డెమాన్‌లో ఉంటున్న సోదరినిని చూడటానికి భూత్పూర్‌లో బస్సు ఎక్కింది. అప్పటికే బస్సులో గుర్తు తెలియని మహిళ లక్ష్మీదేవమ్మను పరిచయం చేసుకొని మాటమాట కలిపింది. బిజినేపల్లికి వచ్చిన తర్వాత మద్యం తాగుదామని గుర్తు తెలియని మహిళ చెప్పడంతో ఇద్దరు కలిసి మద్యం దుకాణానికి తాగారు. లక్ష్మీదేవమ్మ మద్యం మత్తులోకి జారుకోగానే గుర్తు ఆమె కాళ్లకు ఉన్న 24 తులాల కడియాలను, పది గ్రాముల పుస్తెలతాడుని గుర్తుతెలియని మహిళ తీసుకుని పారిపోయింది. మత్తు వదిలిన తర్వాత లక్ష్మీదేవమ్మ ఒంటిపై నగలు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగశేఖరరెడ్డి తెలిపారు.

గుట్కా పాకెట్ల పట్టివేత

మక్తల్: అక్రమంగా నిల్వ చేసిన నిషేధిత గుట్కా పాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి వివరాల మేరకు.. పట్టణానికి చెందిన గురుస్వామి తన ఇంట్లో నిషేధిత గుట్కా పాకెట్లు నిల్వ చేశారన్న సమాచారం మేరకు పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. రూ. 17,610 విలువగల గుట్కా పాకెట్లను స్వాధీనం చేసుకొని, అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని బుధవారం ఢిల్లీలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డి కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

– స్టేషన్ మహబూబ్‌నగర్

జీవనాడిపై దాడి!


పోలవరం ఉసురు తీసిందెవరు? ప్రాణం పోసిందెవరు?

ఇదంతా కమీషన్ల దాహం, అస్తవ్యస్త పనుల పాప ఫలితం కాదా?

ప్రాజెక్టు నిర్మాణ ప్రణాళికను తుంగలో తొక్కిన చంద్రబాబు


2019 మే 29 నాటికి పునాది స్థాయి కూడా దాటని పోలవరం స్పిల్ వే


వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు ఏరియల్ వ్యూ



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు మన రాష్ట్రానికి జీవనాడి. గరిష్ఠంగా 194.6 టీఎంసీల సామర్థ్యంతో గోదావరిపై నిర్మిస్తున్న అతి పెద్ద జలాశయం ఇదే. కుడి, ఎడమ కాలువ ద్వారా 7.2 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించడంతో గోదావరి, కృష్ణా డెల్టాల్లో 23.5 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చు. ఎడమ కాలువ నుంచి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ద్వారా 8 లక్షల ఎకరాలకు నీళ్లందించవచ్చు. విశాఖ నగరం పారిశ్రామిక, తాగునీటి అవసరాలను తీర్చవచ్చు. ప్రాజెక్టులో నిర్మించే జలవిద్యుత్కేంద్రంలో 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేయవచ్చు. పోలవరం పూర్తయితే రాష్ట్రం రూపురేఖలు సమూలంగా మారిపోవడం ఖాయం. దేశంలో ఈ స్థాయిలో సాగునీరు, తాగునీరు, విద్యుత్తు అవసరాలను తీర్చే బహుళార్థ సాధక ప్రాజెక్టు మరొకటి లేదు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 2005లో ప్రారంభించిన పోలవరాన్ని విభజన నేపథ్యంలో 2014లో కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. తామే వంద శాతం ఖర్చుతో పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. విభజన చట్టం ప్రకారం కేంద్రమే పూర్తి చేయాల్సిన పోలవరం నిర్మాణ బాధ్యతలను కేంద్రానికి ప్రత్యేక హోదా తాకట్టు పెట్టి మరీ 2016 సెప్టెంబరు 7న అధికారంలో ఉండగా చంద్రబాబు దక్కించుకున్నారు. 2013–14 ధరల ప్రకారం రూ.20,946 కోట్లతోనే ప్రాజెక్టును పూర్తి చేస్తానని నమ్మబలికి కేంద్రానికి హామీ ఇచ్చారు. 2014 ఏప్రిల్ 1 వరకూ ఖర్చు చేసిన రూ.4,730.71 కోట్లు పోనూ మిగతా రూ.15,667 కోట్లే ఇస్తామని కేంద్రం తెగేసి చెబితే దానికీ చంద్రబాబు తలూపారు. సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) ఖరారు చేసిన ప్రాజెక్టు నిర్మాణ ప్రణాళికను కమీషన్ల దాహంతో తుంగలో తొక్కి పనులు చేపట్టారు. వరదను మళ్లించేలా స్పిల్‌వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండానే ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పునాది డయాఫ్రమ్‌వాల్‌ను నిర్మించారు. చివరకు ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయలేక ఇరువైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేసి 2019 ఫిబ్రవరిలో చేతులెత్తేశారు. ఈ నిర్వాకాల కారణంగా 2019 జూన్ తర్వాత గోదావరిలో పోటెత్తిన భారీ వరద కాఫర్ డ్యామ్‌ల ఖాళీల మీదుగా అధిక ఉధృతితో ప్రవహించడంతో డయాఫ్రమ్‌వాల్ దెబ్బతింది. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై భారీ అగాధాలు ఏర్పడ్డాయి. ఇదే పోలవరం పనులను అత్యంత సంక్లిష్టంగా మార్చింది. స్పిల్‌వే, కాఫర్ డ్యామ్‌ల పనులను చంద్రబాబు గాలికొదిలేసి డయాఫ్రమ్‌వాల్‌ను నిర్మించడమే ఈ క్లిష్ట పరిస్థితికి మూల కారణం.

అక్రమాలు అరికట్టి కీలక పనులు పూర్తి..

2019 మే 30న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టీడీపీ సర్కార్ చేసిన చారిత్రక తప్పిదాలను సరిచేస్తూ ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టు పనులు చేపట్టారు. పీపీఏ, సీడబ్ల్యూసీ అభ్యంతరాలను బేఖాతర్ చేస్తూ రూ.2,917 కోట్ల విలువైన పనులను నవయుగకు నాడు చంద్రబాబు సర్కార్ నామినేషన్‌పై కట్టబెట్టింది. వీటితోపాటు జలవిద్యుత్కేంద్రం పనుల కాంట్రాక్టు ఒప్పందాన్ని రద్దు చేసి రివర్స్ టెండరింగ్ నిర్వహించడం ద్వారా రూ.783 కోట్లను ఖజానాకు వైఎస్ జగన్ ఆదా చేశారు. నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తూ స్పిల్‌వే, స్పిల్ చానల్, అప్రోచ్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేసి 2021 జూన్ 11నే గోదావరి ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా 6.1 కి.మీ. పొడవున మళ్లించారు. కుడి, ఎడమ కాలువలను జలాశయంతో అనుసంధానించే కనెక్టివిటీస్‌ను పూర్తి చేశారు. ఎడమ కాలువలో వరాహ నదిపై అత్యంత పొడవైన అక్విడెక్టుతోసహా కీలకమైన పనులను విజయవంతంగా పూర్తి చేశారు.

జలవిద్యుత్ కేంద్రం


పోలవరం ఈసీఆర్ఎఫ్ డ్యామ్‌కు ఎడమ వైపున 960 మెగావాట్ల సామర్థ్యంతో జలవిద్యుత్కేంద్రాన్ని నిర్మించాలి. ఎడమ వైపు ఉన్న కొండను తొలిచి 12 ప్రెజర్ టన్నెల్స్ తవ్వి టర్బైన్లను అమర్చి విద్యుత్కేంద్రాన్ని పూర్తి చేయాలి.

2014–19: టీడీపీ హయాంలో

జలవిద్యుత్కేంద్రం నిర్మాణ పనుల్లో కొండను తొలిచే పనుల్లో కేవలం 25 శాతం మాత్రమే చేసి టీడీపీ సర్కార్ చేతులు దులుపుకొంది.


2019–24: వైఎస్సార్ సీపీ పాలనలో

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జలవిద్యుత్కేంద్రం పనులు శరవేగంగా సాగాయి. కొండను తొలిచే పనులను యుద్ధ ప్రాతిపదిక పూర్తి చేసి 12 ప్రెజర్ టన్నెల్స్‌ను పూర్తి చేసింది. టర్బైన్లను అమర్చడానికి అవసరమైన అన్ని పనులు పూర్తి చేసింది. టర్బైన్ల తయారీ బాధ్యతను బీహెచ్ఈఎల్‌కు అప్పగించింది. జలవిద్యుత్కేంద్రం పనులను దాదాపుగా కొలిక్కి తెచ్చింది. పోలవరం జలాశయం పనులు పూర్తయ్యేలోగా విద్యుదుత్పత్తి ప్రారంభించే విధంగా జలవిద్యుత్కేంద్రం పనులను వేగవంతం చేసింది.



జలవిద్యుత్కేంద్రం పనులను సైతం కొలిక్కి తెచ్చారు. ఈసీఆర్ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో అగాధాలను సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు ఇసుకతో పూడ్చి వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెచ్చారు. ఇక డయాఫ్రమ్‌వాల్ భవితవ్యాన్ని తేలిస్తే 18 నెలల్లోగా ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని 2022 డిసెంబర్ నుంచి వైఎస్ జగన్ కేంద్రాన్ని కోరుతూ వచ్చారు. అయితే అంతర్జాతీయ సాంకేతిక నిపుణుల సహకారం తీసుకుని డిజైన్లు ఖరారు చేసి పనులు చేపట్టేలా సీడబ్ల్యూసీ ప్రణాళిక రచించింది. 2017–18 ధరల ప్రకారం భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం వ్యయమే రూ.33,168.23 కోట్లని, అందువల్ల 2013–14 ధరల ప్రకారం రూ.20,946 కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేయడం అసాధ్యమని ప్రధాని మోదీకి నాడు సీఎం హోదాలో వైఎస్ జగన్ అనేక సార్లు విన్నవించారు. ఈ క్రమంలో తాజా ధరల మేరకు నిధులిచ్చి పోలవరం పూర్తికి సహకరించాలన్న వైఎస్ జగన్ వినతిపై ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారు. ప్రధాని ఆదేశాల మేరకు పోలవరం తొలి దశ పూర్తికి రూ.12,157.53 కోట్లు విడుదల చేయాలని కేంద్ర జల్ శక్తి శాఖ మార్చి 6న కేంద్ర కేబినెట్‌కు ప్రతిపాదన పంపింది. అయితే అప్పటికే బీజేపీతో టీడీపీ–జనసేనకు పొత్తు కుదిరింది. ఈ నేపథ్యంలో పోలవరానికి నిధులు మంజూరు చేస్తూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపితే అది ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా మారుతుందని, అందువల్ల దాన్ని ఆపేయాలని బీజేపీ అధిష్టానంపై చంద్రబాబు ఒత్తిడి తెచ్చారు. ఇలా అడ్డుపుల్ల వేయడంతో నిధుల విడుదల ప్రతిపాదనను కేంద్ర కేబినెట్ పక్కన పెట్టింది.

స్పిల్ వే:



గోదావరికి 50 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా సులభంగా దిగువకు విడుదల చేసేలా స్పిల్‌వేను నిర్మించాలి. ప్రాజెక్టు పనుల్లో తొలుత పూర్తి చేయాల్సింది స్పిల్ వేనే. 1,118 మీటర్ల పొడవు, 53.32 మీటర్ల ఎత్తుతో నిర్మించే స్పిల్ వేకు 25.72 మీటర్ల నుంచి 45.72 మీటర్ల వరకూ 20 మీటర్ల ఎత్తు, 16 మీటర్ల వెడల్పుతో గేట్లు అమర్చాలి. వరద వచ్చినప్పుడు దిగువకు విడుదల చేయడానికి వీలుగా అత్యాధునిక హైడ్రాలిక్ హాయిస్ట్‌లను గేట్లకు అమర్చాలి. ప్రపంచంలో గరిష్ఠంగా వరద జలాలను దిగువకు విడుదల చేసే అతి పెద్ద స్పిల్ వే పోలవరంలోనే ఉంది.

2014–19: టీడీపీ హయాంలో

2014 జూన్ 8న సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు 2016 డిసెంబర్ 30న స్పిల్ వే పనులను ప్రారంభించారు. టీడీపీ అధికారం కోల్పోయే నాటికి అంటే 2019 మే 29 నాటికి స్పిల్ వే పనులు పునాది స్థాయిని కూడా దాటలేదు. స్పిల్ వేలో కేవలం రెండు (39, 40) పియర్స్‌ను 30 మీటర్ల వరకూ చేసి వాటి మధ్య ఒక ఇనుప రేకు పెట్టి గేట్ అమర్చినట్లు 2018 డిసెంబర్ 24న చంద్రబాబు ఘనంగా ప్రకటించుకున్నారు.

2019–2024: వైఎస్సార్‌సీపీ పాలనలో

2019 మే 30న సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేశారు. అదే ఏడాది జూన్‌లో ప్రారంభమైన వరద ప్రవాహం నవంబర్ వరకూ కొనసాగింది. 2020 మార్చి నుంచి 2021 వరకూ కరోనా మహమ్మారి విరుచుకు పడింది. అయితే గోదావరి వరదలు, కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ వైఎస్ జగన్ రికార్డు సమయంలో స్పిల్ వేను పూర్తి చేశారు. లాక్‌డౌన్‌లోనూ జర్మనీ, జపాన్ నుంచి హైడ్రాలిక్ హాయిస్ట్ సిలిండర్లను దిగుమతి చేసుకుని స్పిల్ వేకు 48 గేట్లను బిగించారు. 2021 జూన్ 11న గోదావరి వరదను స్పిల్ వే మీదుగా విజయవంతంగా మళ్లించారు.

ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు





నదికి అడ్డంగా ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ నిర్మించడానికి వీలుగా.. గోదావరి వరద ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లించేందుకు ఈసీఆర్ఎఫ్‌కు ఎగువన 2,840 మీటర్ల పొడవు, 43 మీటర్ల ఎత్తుతో ఒక కాఫర్ డ్యామ్‌ను, దిగువన 1,655 మీటర్ల పొడవు, 31.5 మీటర్ల ఎత్తుతో మరో కాఫర్ డ్యామ్‌ను నిర్మించాలి.

2014–19: టీడీపీ హయాంలో

ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను నిర్మించకముందే ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో పునాది డయాఫ్రమ్‌వాల్‌ను 1,396 మీటర్ల పొడవున పూర్తి చేసిన చంద్రబాబు 2018 జూన్ 11న జాతికి అంకితం చేశారు. ఎగువ కాఫర్ డ్యామ్ నిర్మించాలంటే 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలో ముంపునకు గురయ్యే 54 గ్రామాల్లోని 20,946 కుటుంబాలకు పునరావాసం కల్పించాలి. ఈమేరకు సీడబ్ల్యూసీ, పీపీఏకు హామీ ఇచ్చిన చంద్రబాబు సర్కార్ 2018 నవంబర్‌లో ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులు ప్రారంభించింది. అయితే రూ.484 కోట్లు ఖర్చు చేసి కేవలం 3,110 కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించారు. మిగతా నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా, కాఫర్ డ్యామ్‌లకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాన్ని వదిలేసిన చంద్రబాబు సర్కార్ ఆ పనులను పూర్తి చేయలేక చేతులెత్తేసింది. 2019 జూన్‌లో ప్రారంభమైన గోదావరి వరద ప్రవాహానికి ఎగువ కాఫర్ డ్యామ్ అడ్డంకిగా మారింది. దాంతో కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గుండా అధిక ఉధృతితో ప్రవహించడంతో గ్యాప్–2లో డయాఫ్రమ్‌వాల్ నాలుగు చోట్ల కోతకు గురై 485 మీటర్ల పొడవున దెబ్బతింది. ఈసీఆర్ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో సగటున 26 మీటర్ల నుంచి 36.5 మీటర్ల లోతు వరకు భారీ అగాధాలు ఏర్పడ్డాయి.

2019–24: వైఎస్సార్ సీపీ పాలనలో

ఎగువ కాఫర్ డ్యామ్ ప్రభావం వల్ల ముంపునకు గురయ్యే 8,446 కుటుంబాలకు రూ.1,670 కోట్లతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పునరావాసం కల్పించింది. ఆ తర్వాత ఎగువ కాఫర్ డ్యామ్‌ను 43 మీటర్ల ఎత్తుతో, దిగువ కాఫర్ డ్యామ్‌లో కోతకు గురైన ప్రాంతాన్ని సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు 31.5 మీటర్ల ఎత్తుతో పూర్తి చేసింది. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లతోపాటు 2.1 కి.మీ. పొడవున అప్రోచ్ ఛానల్, 2.92 కి.మీ. పొడవున స్పిల్ ఛానల్, వెయ్యి మీటర్ల పొడవున పైలట్ ఛానల్‌ను పూర్తి చేసి 2021 జూన్ 11న గోదావరి ప్రవాహాన్ని మళ్లించింది.

జీవం తీసిందెవరు? ప్రాణం పోసిందెవరు?

తాజాగా పోలవరాన్ని సందర్శించిన సీఎం చంద్రబాబు జీవనాడి లాంటి ప్రాజెక్టును వైఎస్ జగన్ విధ్వంసం చేశారంటూ నిస్సిగ్గుగా బుకాయించారు. కమీషన్లకు ఆశపడి పోలవరం జీవం తీసిన చంద్రబాబు దీన్ని కప్పిపుచ్చి జీవం పోసిన వైఎస్ జగన్‌పై బురద జల్లే యత్నం చేయడాన్ని సాగునీటిరంగ నిపుణులు తప్పుబడుతున్నారు.

జూరాలకు 3,782 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం ప్రాజెక్టుకు 3,782 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ద్వారా 750, ఆవిరి రూపంలో 141, భీమా లిఫ్టు–1కు 650, కోయిల్ సాగర్‌కు 315, భీమా లిఫ్టు–2కు 844, సమాంతర కాల్వకు వెయ్యి క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి 2,856 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 9.029 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రామన్‌పాడుకు వెయ్యి క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం పెరుగుతుంది. జూరాల సమాంతర కాల్వ ద్వారా నీటిని వదులుతున్నారు. బుధవారం నాటికి 1,019 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. సమాంతర కాల్వ ద్వారా వెయ్యి క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు.

సుంకేసులకు తగ్గిన ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల బ్యారేజీకి ఎగువ నుంచి వస్తున్న వరద బుధవారం తగ్గుముఖం పట్టింది. మంగళవారం 2వేల క్యూసెక్కులపై పైగా కొనసాగిన ఇన్‌ఫ్లో బుధవారం స్వల్పంగా తగ్గింది. ఎగువ నుంచి 1,450 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా, ఒక గేటును తెరిచి 1,348 క్యూసెక్కులు దిగువకు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు.

శ్రీశైలంలో 813.8 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం నీటిమట్టం 813.8 అడుగుల వద్ద 36.6 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సుంకేసుల నుంచి 1,348 క్యూసెక్కుల నీటిప్రవాహం శ్రీశైలం వైపు వస్తున్నాయి. 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోతల చేశారు. జలాశయంలో 62 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

గృహజ్యోతి అమలయ్యేనా?

- జీరో విద్యుత్ బిల్లు రాలేదని వినియోగదారుల ఆందోళన
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- అధికారుల్లో కొరవడిన స్పష్టత



జడ్చర్ల టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒకటైన గృహజ్యోతి పథకం అమలుపై జిల్లా వినియోగదారుల్లో ఆందోళన నెలకొంది. ఈ పథకం రాష్ట్రమంతా ఫిబ్రవరి నుంచే అమలుకాగా.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా అమలు కాలేదు. అయినప్పటికీ మార్చి నుంచి బిల్లు చెల్లించొద్దని, కోడ్ ముగిశాక జీరో బిల్లు వస్తుందని అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు విస్తృతంగా ప్రచారం చేశారు. దీంతో కొందరు వినియోగదారులు మార్చి నుంచి బిల్లులు చెల్లించకుండా ఉన్నారు. ఎమ్మెల్సీ, పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిశాక జూన్‌లో కూడా జీరో బిల్లు వస్తుందని ఆశించినా.. చివరకు రాకపోవటంతో వినియోగదారుల్లో ఆందోళన మొదలైంది. జూన్‌లో అందించిన బిల్లు మొత్తం చెల్లించాలని.. అప్పుడే గృహజ్యోతి పథకానికి అర్హులవుతారని సిబ్బంది చెబుతుండటంతో దిక్కుతోచని వినియోగదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఆయా కార్యాలయాల్లో అధికారులు సైతం ఈ విషయంపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవటంతో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి.

39,282 మందికే జీరో బిల్లు..

జడ్చర్ల డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో కేవలం 39,282 మంది వినియోగదారులకు మాత్రమే జీరో బిల్లులు వచ్చాయి. ఈ డివిజన్ పరిధిలో జడ్చర్ల, మిడ్జిల్, భూత్పూర్, మూసాపేట, రాజాపూర్, అడ్డాకుల, బాలానగర్, రాజాపూర్, నవాబుపేట మండలాలు ఉన్నాయి. వీటిలో మొత్తం గృహ విద్యుత్ కనెక్షన్లు 92,602 ఉండగా.. ఇప్పటి వరకు కేవలం 39,282 మందికి మాత్రమే జీరో బిల్లు అందింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారెంటీల అమలుకు ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించింది. వాటిని ఆన్‌లైన్ చేసిన తర్వాత ఫిబ్రవరి మొదటి వారంలో విద్యుత్ సిబ్బంది ఇల్లిల్లూ తిరిగి మీటర్ నంబరుకు ఆధార్, రేషన్‌కార్డును అనుసంధానం చేశారు. వాటి ఆధారంగానే గృహజ్యోతి పథకం అమలు కావాల్సి ఉంది.


గృహజ్యోతి అమలుకు మీటర్ నంబరుకు ఆధార్, రేషన్‌కార్డు అనుసంధానం చేస్తున్న విద్యుత్ సిబ్బంది (ఫైల్)

ప్రభుత్వ నిర్ణయానికి వేచి ఉన్నాం..

జీరో విద్యుత్ బిల్లు రాని వినియోగదారుల విషయంలో ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తున్నాం. డివిజన్ పరిధిలో 92,602 గృహ విద్యుత్ వినియోగదారులుండగా.. 39,282 మందికి మాత్రమే గృహజ్యోతి అమలైంది. మిగిలిన వారిలో కొందరికి తెల్లరేషన్ కార్డులు లేవు. రేషన్‌కార్డు ఉండి బిల్లులు వచ్చిన వారి విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికైతే బిల్లు వచ్చిన వారు చెల్లించాలని కోరుతున్నాం.

– కృష్ణమూర్తి, విద్యుత్ డీఈ, జడ్చర్ల

బిల్లు చెల్లించాలంటున్నారు..



మూడు నెలలుగా విద్యుత్ బిల్లు చెల్లించలేదు. మొత్తం రూ.2,312 బకాయి ఉంది. ఇదేమని అడిగితే బకాయి మొత్తం చెల్లిస్తే జీరోబిల్ వస్తుందని విద్యుత్ సిబ్బంది చెబుతున్నారు. రోజు కూలి చేసుకుని జీవించే వాళ్లం.. రూ.వేల బిల్లు చెల్లించే పరిస్థితి లేదు. మాకు న్యాయం చేయాలి.

– బాలస్వామి, పాతబజార్ (జడ్చర్ల)

జీరో బిల్ రాలేదు..



ప్రతి నెల వచ్చిన బిల్లు చెల్లిస్తూనే ఉన్నాం. ఈ నెల జీరో బిల్ వస్తుందని అనుకున్నాం.. కాని రూ.300 పైగా వచ్చింది. బిల్ క్లియర్ చేసిన వారికే జీరో బిల్ అంటున్నారు.

– లింగం, జడ్చర్ల

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం..

ప్రజాపాలన దరఖాస్తుల్లో ఆధార్, రేషన్‌కార్డు నంబర్లు తప్పుగా నమోదు చేయటం వంటివి సవరించడానికి ఉన్నతాధికారులు అవకాశం ఇచ్చారు. జీరో విద్యుత్ బిల్లు కోసమైతే దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ప్రజాపాలన రసీదు, ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్ జూన్‌లో వచ్చిన విద్యుత్ బిల్లు రసీదు కార్యాలయంలో అందించాలి.

– వెంకట్‌ప్రసాద్, ఎంపీడీఓ, జడ్చర్ల

మరోమారు దరఖాస్తుల స్వీకరణ..

గృహజ్యోతి అమలుకాని వినియోగదారులు ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ప్రజాపాలన రసీదుతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, విద్యుత్ బిల్ జిరాక్స్‌ను సమర్పిస్తే ప్రభుత్వం నిర్ణయం మేరకు వాటిని గృహజ్యోతికి మార్చే అవకాశాలున్నాయి.

పడిపోయిన ఫలితాలు


వసతిగృహం పక్కనే చెత్తాచెదారం

- పాఠశాలకు రాని విద్యార్థులు
- రెగ్యులర్ ఉపాధ్యాయులు ఉన్నా.. ఫలితాలు డీలా
- విధులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు
- సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల జాయింట్ సెక్రటరీ శారద హెచ్చరిక

అచ్చంపేట రూరల్: నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల అంటే ఒకప్పుడు ఎంతో చరిత్ర ఉండేది. విద్యార్థుల పరీక్ష ఫలితాల్లో, ఆటల్లో మేటీగా ఉండేవారు. అక్కడ సీటు దొరకాలంటే ఎంతో కష్టంగా ఉండేది. సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి విద్యనభ్యసించి ప్రయోజకులయ్యారు. ఉన్నత స్థాయి ఉద్యోగాలల్లో స్థిరపడ్డారు. ఏ ప్రదేశంలో ఆటల పోటీలు నిర్వహించినా అచ్చంపేట విద్యార్థులు భళా అనిపించేవారు. ప్రస్తుతం ఆ పాఠశాల, కళాశాలలో ఫలితాలు పడిపోవడంతో విద్యార్థులు రావడానికి జంకుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు ఫోన్లు చేసి బ్రతిమిలాడుతున్నా.. వేరే పాఠశాల, కళాశాలలో చేర్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

రెగ్యులర్ ఉపాధ్యాయులున్నా..

స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి 640 మంది విద్యార్థులు ఉండగా, ఇంటర్ మొదటి సంవత్సరంలో 80 మంది విద్యార్థులకు గాను 24శాతం, ద్వితీయ సంవత్సరంలో 80 మంది విద్యార్థులకు 44శాతం ఉత్తీర్ణులయ్యారు. పదో తరగతి వార్షిక పరీక్షలో 98శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కాగా ఈ పాఠశాల, కళాశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉన్నా ఫలితాలు డీలా పడటంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వసతులు, రెగ్యులర్ సిబ్బంది లేని చోట ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, పేరుగాంచిన పాఠశాల, కళాశాలలో ఫలితాలు అంతంత మాత్రంగా రావడంపై ఎవరి నిర్లక్ష్యమో తెలియడం లేదు. దీనికి తోడు ఆ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు కరోనా సాకులు చెప్పడం విడ్డూరంగా ఉంది. ఎక్కడా సీటు రాని విద్యార్థులు ఈ పాఠశాలలో చేరుతున్నారని, అందుకే ఫలితాలు అంతంతగా వచ్చాయన్నట్లు, విద్యార్థుల లోపమన్నట్లుగా చెబుతున్నారు. ఈ పాఠశాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థులు తల్లిదండ్రులు అంటున్నారు.

విధులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు


వంటశాల, భోజనశాలను పరిశీలిస్తున్న జాయింట్ సెక్రటరీ శారద

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులు, అధ్యాపకులు అంకితభావంతో పని చేయాలని, నిబంధనలు ఉల్లంఘించి నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల జాయింట్ సెక్రటరీ శారద హెచ్చరించారు. బుధవారం స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. ప్రార్థన సమయం నుంచి మధ్యాహ్న భోజన వేళ వరకు పరిశీలించారు. 1వ తేదీ నుంచి కళాశాల, 12 నుంచి పాఠశాల ప్రారంభమైనా కేవలం 31 మంది విద్యార్థులే కన్పించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా తక్కువగా విద్యార్థులు హాజరవ్వడం ఏంటని ప్రిన్సిపాల్ ఎల్. రాములును అడిగారు. భోజనశాల, వసతి గృహం పరిశీలించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కిటికీ అద్దాలు పగిలి ఉండటం, భవనానికి రంగు లేకుండా ఉండటాన్ని చూశారు. పాఠశాల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశీలన విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాఖాపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే ఉపాధ్యాయులు, అధ్యాపకుల బదిలీలు ఉంటాయని, విద్యార్థులు పాఠశాల, కళాశాలలో చేరాలని, అందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చేర్పించాలని చెప్పారు.

హైవేపై ట్రాఫిక్‌జాం

రాజాపూర్: మండల కేంద్రం సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న దుందుభి వాగు బ్రిడ్జి వద్ద బుధవారం వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దుందుభి వాగుపై ఉన్న బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టేందుకుగాను నేషనల్ హైవే నిర్వాహణ సిబ్బంది ఒకే లైన్‌లోకి వాహనాలను మళ్లించారు. దీంతో పోలేపల్లి సెజ్‌లోకి వెళ్లే సర్వీస్ రోడ్డు నుంచి వాహనాలు వెళ్లడంతో హైదరాబాద్ వైపు వచ్చే వాహనాలు ముదిరెడ్డిపల్లి నుంచి దాదాపు 5 కి.మీ. మేర నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాజాపూర్ ఎస్ఐ రవి పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

